క్లుప్తంగా

ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల గడువు పొడిగింపు

గరిడేపల్లి : ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల గడువు ఈ నెల 11 వరకు పొడిగించినట్లు గరిడేపల్లి ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ చత్రునాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి పాసైన వారు ఒకే ఏడాదిలో ఇంటర్ పూర్తిచేసే అవకాశం ఉందని, సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

దివ్యాంగ విద్యార్థులు చదువులో రాణించాలి



దివ్యాంగ విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ వెంకటాచారి

మఠంపల్లి : దివ్యాంగ విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో చదువుతో పాటు ఆటల్లోనూ రాణించాలని ఎంఈఓ వెంకటాచారి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో ఐఈఆర్‌సీ కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగ విద్యార్థులకు నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలకు ఎంఈఓ బహుమతులు పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల హెచ్ఎంలు మౌలాన, కిరీటం, రాధమ్మ, ఉపాధ్యాయులు నుస్రత్‌జహాన్, జ్యోత్స్న, నీరజ, ఐఈఆర్పీలు రంగారావు, నాగలక్ష్మి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కల్యాణ మండపం నిర్మాణానికి విరాళం

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీకోదండ రామస్వామి ఆలయానికి అనుబంధంగా కల్యాణ మండపం నిర్మాణానికి బుధవారం నడిగూడెంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు దాతలు ముందుకొచ్చారు. నడిగూడెం సహకార సంఘం చైర్మన్ కొల్లు రామారావు 50 సిమెంట్ బస్తాలు, రామాపురం గ్రామానికి చెందిన మెండె వెంకటేశ్వర్లు రూ.20 వేలు, మునగాల మండలం బరాఖత్‌గూడెంకు చెందిన చల్లా శేఖర్ రూ.10 వేలు, నడిగూడెంకు చెందిన చిలికేశ్వరపు లచ్చయ్య ఐదు వేల రూపాయల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు భవురిశెట్టి వెంకటరత్నం, కొండా వెంకన్న, వందనపు సూర్య ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

శివాలయం హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న అధికారులు, భక్తులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీపార్వతీ భీమ లింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. కార్తీక మాసం పూర్తి అయినందున దేవాదాయ శాఖ మిర్యాలగూడ డివిజన్ ఇన్‌స్పెక్టర్ పి.ఏడుకొండలు సమక్షంలో హుండీలను తెరిచి లెక్కించారు. ఈ సందర్భంగా రూ.71,499 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి గుజ్జుల కొండారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు రవిశర్మ, భక్తులు కీతా మల్లికార్జున్, కె.అరవింద్‌రెడ్డి, కె.శ్రీనివాస్‌రెడ్డి, సురేష్, క్రాంతిరెడ్డి ఆలయ సిబ్బంది కొండారెడ్డి, గోవిందరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న చిన వెంకట్‌రెడ్డి

నేరేడుచర్ల : మండలంలోని మూసీ ఒడ్డుసింగారం నుంచి రామకృష్ణతండా వరకు రూ.3 కోట్ల వ్యయంతో చేపడుతున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొణతం చిన వెంకట్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్ల సమస్యలను పరిష్కరించేందుకు మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి.. ఎస్టీఎఫ్ నిధుల నుంచి నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తి అయితే గిరిజన తండాలకు రవాణా సౌకర్యం మెరుగవుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు పాండునాయక్, శంకరాచారి ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి

నడిగూడెం : ఎస్సీ వర్గీకరణ తక్షణమే అమలు చేయాలని ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పందిటి నవీన్‌కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు 58 ఉప కులాలు అనుకూలంగా ఉన్నాయని తక్షణమే వర్గీకరణ చేసి, మాదిగలకు న్యాయం చేయాలని కోరారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగను విమర్శించే స్థాయి మాల మహానాడు నాయకులకు లేదన్నారు.

మరో గ్రామీణ రహదారికి మోక్షం

- డబుల్ రోడ్డుగా మారనున్న జానకీనగర్ రోడ్డు
- రూ.20.40 కోట్ల నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం
- త్వరలో పనులకు శంకుస్థాపన చేయనున్న మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



డబుల్ లైన్‌గా మారనున్న జానకీనగర్ రోడ్డు

చిలుకూరు : మండలంలో మరో గ్రామీణ రహదారికి మోక్షం లభించింది. ఇప్పటికే బేతవోలు రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చే పనులు ముమ్మరంగా జరుగుతుండగా, జానకీనగర్ రహదారిని డబుల్ లైన్‌గా మార్చేందుకు ప్రభుత్వం 20 కోట్ల 40 లక్షల రూపాయల నిధులు మంజూరు చేసింది. దీంతో కోదాడ పట్టణ పరిధిలోని బాలాజీ నగర్ వద్ద ఎన్నెస్పీ కాలువ దగ్గర నుంచి చిలుకూరు మండలంలోని జానకీనగర్, దూదియాతండా, సీత్లాతండా, నారాయణపురం మీదుగా కోదాడ మండలంలోని భీక్యాతండా వరకు రూ.10 కిలోమీటర్ల మేర డబుల్ రోడ్డుగా మారనుంది. అయితే ఎన్నో ఏళ్లగా డబుల్ రోడ్డుగా మార్చాలని ప్రతిపాదనలు చేసినా అది కాగితాలకే పరిమితం అయింది తప్ప నిధులు మాత్రం మంజూరు కాలేదు. ప్రస్తుతం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని డబుల్ రోడ్డు నిర్మాణానికి ఆర్అండ్‌బీ శాఖ నుంచి నిధులు మంజూరు చేయించారు. త్వరలో డబుల్ రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతి శంకుస్థాపన చేయనున్నారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

7 మీటర్ల వెడల్పు బీటీ రోడ్డుగా..

జానకీనగర్ రహదారిని 7 మీటర్లు వెడల్పు బీటీ రోడ్డుగా నిర్మించనున్నారు. బీటీతో పాటు రోడ్డుకు ఇరుపక్కల కలిపి 3 మీటర్లు మట్టి రోడ్డు ఉంటుంది. మొత్తం 33 ఫీట్లు రోడ్డుగా మారనుంది. అయితే ప్రస్తుతం ఈ రోడ్డు సింగిల్ లైన్ (10 ఫీట్లు) వరకు బీటీ ఉంది. కాని రోడ్డుకు ఇరు పక్కల స్థలం ఆక్రమణలో ఉంది. అది ప్రభుత్వ భూమే కాబట్టి డబుల్ రోడ్డు నిర్మాణానికి ప్రత్యేకంగా భూసేకరణ చేపట్టాల్సిన పని లేదు. దీంతో పనులు త్వరితగతిన పూర్తి అవుతాయని సంబంధిత అధికారులు అంటున్నారు. గ్రామాల్లో సీసీ రోడ్డు వేయనున్నారు.

పనులు వెంటనే ప్రారంభిస్తాం



“జానకీనగర్ రహదారిని డబుల్ రోడ్డుగా మార్చేందుకు రూ. 20 కోట్ల 40 లక్షల నిధులు మంజూరయ్యాయి. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో కలిసి రోడ్డు నిర్మాణ పనులకు త్వరలో శంకుస్థాపన చేయనున్నాం. రోడ్డు నిర్మాణ పనులకు కూడా వెంటనే ప్రారంభిస్తాం. నియోజకవర్గ వ్యాప్తంగా రోడ్ల సమస్యలను పరిష్కరిస్తాం.

– ఎస్. పద్మావతిరెడ్డి, ఎమ్మెల్యే, కోదాడ

హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని ధర్నా



హాస్టల్ ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కోదాడరూరల్ : పట్టణంలోని ఎస్టీ(బీ) హాస్టల్‌లో విద్యార్థులకు అందించే భోజనంలో మెనూ పాటించని వార్డెన్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనియాకుల శ్రీకాంత్ వర్మ డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం హాస్టల్ ఎదుట ధర్నా నిర్వహించి మాట్లాడారు. హాస్టల్‌లో అన్నం ముద్దలుగా ఉంటుందని, కేజీ పప్పును నీళ్ల చారులాగా చేసి 80 మంది విద్యార్థులకు పెడుతున్నారని ఆరోపించారు. వార్డెన్ నెలలో ఒక్కరోజు కూడా హాస్టల్‌కు రాకపోవడంతో సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. విద్యార్థుల పట్ల బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తున్న వార్డెన్‌ను సస్పెండ్ చేసి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి బాణోతు వినోద్, జాను, రమణ, పవన్, సుమన్, గోపి, గణేష్, చంద్రశేఖర్ ఉన్నారు.

ఆదర్శ కమ్యూనిస్టు.. పోటు ప్రసాద్



ప్రసాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

గరిడేపల్లి : అమరజీవి పోటు ప్రసాద్ ఆదర్శ కమ్యూనిస్టు అని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్, సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండలంలోని గానుగబండ గ్రామంలో నిర్వహించిన పోటు ప్రసాద్ సంతాప సభలో వారు మాట్లాడారు. ప్రసాద్ సీపీఐ జిల్లా బాధ్యతలు నిర్వర్తించారని, కమ్యూనిస్టు పార్టీలో పనిచేస్తూ అందరికి ఆదర్శంగా నిలిచారన్నారు. సీపీఐ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా డిసెంబర్ 30న నల్లగొండలో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పోకల వెంకటేశ్వర్లు, రాష్ట్ర సమితి సభ్యుడు యల్లావుల రాములు, బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనుంజయ నాయుడు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్, మండవ వెంకటేశ్వర్లు, గుండు వెంకటేశ్వర్లు, కడియాల అప్పయ్య, వెంకటరెడ్డి, చిలకరాజు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల పొట్టకొడుతున్న బీజేపీ ప్రభుత్వం



మాట్లాడుతున్న నెమ్మాది వెంకటేశ్వర్లు

గరిడేపల్లి : కార్పొరేట్ శక్తులకు లాభాలు రావడం కోసం బ్రిటిష్ కాలం నుంచి నేటి వరకు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను బీజేపీ ప్రభుత్వం కుదించి లేబర్ కోడ్‌లను తెచ్చి కార్మికుల పొట్ట కొడుతోందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం గరిడేపల్లి మండల కేంద్రంలోని మేదరమెట్ల సీతారామయ్య భవన్‌లో నిర్వహించిన సీఐటీయూ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమలలో పని చేస్తున్న కార్మికుల వేతన సవరణ ఒప్పందాన్ని అమలు చేయకుండా గత బీఆర్ఎస్ ప్రభుత్వం కంటే మరింత అన్యాయంగా వ్యవహరిస్తుందన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఈ నెల 7న జిల్లా వర్క్‌షాపును జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు షేక్ యాకూబ్, రణపంగ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలకు నిలయంగా కల్వర్టు



ఇరువైపులా మట్టి కొట్టుకుపోయి ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు

చిలుకూరు : మండల కేంద్రంలో అంతర్గంగ వాగుపై కల్వర్టు ప్రమాదకరంగా ఉంది. మూడు నెలల క్రితం వచ్చిన భారీ వరదలకు కల్వర్టు చుట్టూ, వాగు పక్కన గల మడేలేశ్వరస్వామి ఆలయం వైపు మట్టి కొట్టుకుపోయింది. ఆ సమయంలో అక్కడ ఉన్న విద్యుత్ స్తంభం ఒరిగి ప్రమాదకరంగా మారడంతో సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీంతో సంబంధిత అధికారులు స్తంభాన్ని అక్కడ నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పక్కకు మార్చారు. కానీ ఆలయం వద్ద నేటి వరకు మట్టి పోయలేదు. దీంతో రాత్రి సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే కల్వర్టు పక్కన కోతకు గురైన ప్రదేశంలో మట్టి పోయాలని కోరుతున్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి తీవ్రగాయాలు

తుంగతుర్తి : తాటిచెట్టు పైనుంచి పడి ఓ గీత కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని కొత్తగూడెం గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చామకూరి వీరసోములు రోజు వారీగా తాటిచెట్టు ఎక్కి దిగుతుండగా ప్రమాదవశాత్తు మోకు జారి కిందపడ్డాడు. దీంతో ఆయనకు తీవ్రగాయాలయ్యాయని, చికిత్స నిమిత్తం సూర్యాపేటలోని ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు వెల్లడించారు.

మాలధారులకు అన్నప్రసాద వితరణ



కోదాడరూరల్ : అన్నదానం చేస్తున్న దాత, నిర్వాహకులు



మునగాల : అన్నదానంలో పాల్గొన్న దాతలు, మాలధారులు

మునగాల : మండల కేంద్రం శివారులోని అయ్యప్ప ఆలయం ఆవరణలో గల అన్నప్రసాద వితరణ కేంద్రంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం కొనసాగుతోంది. బుధవారం పాలకీడు మండలం జాన్‌పహాడ్ గ్రామానికి చెందిన బాధావత్ మౌర్య జ్ఞాపకార్థం కుమారుడు నాగేశ్వరరావు – రమాదేవి దంపతులు, విజయవాడకు చెందిన సాల్లేటి శివ –అంజలి దంపతుల కుమార్తె నిత్యశ్రీ పుట్టినరోజును పురస్కరించుకొని అన్నదానానికి సహకరించినట్లు ఆలయ చైర్మన్ తడకమళ్ల శ్రీనివాసాచారి గురుస్వామి తెలిపారు. కార్యక్రమంలో గురుస్వాములు, మాలధారులు పాల్గొన్నారు

అయ్యప్ప సన్నిధానంలో..

కోదాడరూరల్ : పట్టణంలోని హుజూర్‌నగర్ రోడ్డులో గల గాలి రమేష్ నాయుడు అయ్యప్ప సన్నిధానంలో 24వ రోజు బుధవారం మాలధారులకు అన్నదాన చేశారు. ఎర్రవరం పీఏసీఎస్ చైర్మన్ నలాజాల శ్రీనివాసరావు అన్నదానం ఏర్పాటు చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో నిర్వాహకులు గాలి శ్రీనివాస్‌నాయుడు, మాలధారులు ఉన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంపీడీఓ ఇమామ్

నడిగూడెం : విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలని ఎంపీడీఓ సయ్యద్ ఇమామ్ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు ఉన్నారు.

న్యాస్ పరీక్ష పరిశీలన



న్యాస్ పరీక్షను పరిశీలిస్తున్న ఎంఈఓ చత్రునాయక్

గరిడేపల్లి : మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, గుండాల మిట్ట, రాయినిగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో బుధవారం నిర్వహించిన నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (న్యాస్) పరీక్షను మండల విద్యాధికారి చత్రునాయక్ పరిశీలించారు. అదేవిధంగా రాయినిగూడెం ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. వంట పాత్రలు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. న్యాస్ పరీక్ష పరిశీలకులు పాషా, సీహెచ్.వెంకటేశ్వర్లు, ఆర్.సురేందర్, ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్స్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు హైమావతి, రవినాయక్, పద్మ, సీఆర్పీలు రామకృష్ణ, వెంకటేశ్వర్లు, అశోక్‌కుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విజయోత్సవ పూజలు



సీతారామచంద్రస్వామి ఆలయంలో హోమం నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, పూజారి

చిలుకూరు : ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా బుధవారం చిలుకూరు మండలంలోని బేతవోలు గ్రామంలో గల సీతారామచంద్రస్వామి ఆలయంలో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ మృత్యుంజయశాస్త్రి, ఆలయ చైర్మన్ పెండ్యాల వీరస్వామి, ధర్మకర్తలు ఓరుగంటి లక్ష్మీనరసింహారావు, అనబత్తుల వేణు, బొల్లు బ్రహ్మారెడ్డి, పూజారి నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ నాయకులను ఆదర్శంగా తీసుకోవాలి

సూర్యాపేట : జాతీయ నాయకులను ఆదర్శంగా తీసుకోవాలని గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ పొందిన విభిన్న పాత్రాభినయ కళాకారులు, పర్యావరణ వేత్త, రచయిత పెండెం కృష్ణకుమార్ అన్నారు. బుధవారం సూర్యాపేటలోని మండల వనరుల కేంద్రంలో మండల విద్యాధికారి శేషగాని శ్రీనివాస్‌గౌడ్‌కు 14రకాల దేశ నాయకుల, శాస్త్రవేత్తల చిత్రపటాలు, వాటర్ క్యాన్, గోడ గడియారం, క్లాత్ బ్యాగ్స్ అందజేశారు. అనంతరం కృష్ణకుమార్ మాట్లాడారు. జాతీయ నాయకులు, శాస్త్రవేత్తలు ఎంతో మంది మన దేశానికి చేసిన కృషిని మనం ఎల్లప్పుడూ స్మరించుకోవాలని, వారిని ఆదర్శంగా తీసుకొని వారి మార్గంలో పయనించాలని అన్నారు. మండల విద్యాధికారి శేషగాని శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. దాత పెండెం కృష్ణకుమార్ విద్యార్థుల కోసం క్రీడా సామగ్రిని, దేశ నాయకుల పటాలను, శాస్త్రవేత్తల పటాలను, క్లాత్ బ్యాగులను అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో దక్షిణ భారతదేశ సైన్స్ ఫెయిర్ అవార్డు గ్రహీత, తెలంగాణ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత సతీష్‌బాబు, నీరజలత తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో మధ్యాహ్న భోజనం తనిఖీ



మోడల్ స్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ

మునగాల : మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో బుధవారం తహసీల్దార్ వి.ఆంజనేయులు, ఎంపీడీఓ కె.రమేష్‌దీనదయాళ్ మధ్యాహ్న భోజనాన్ని అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలన్నారు. బియ్యంలో పురుగులు లేకుండా చూసుకోవాలని, కూరగాయలు శుభ్రంగా కడిగి వండాలన్నారు. వంటగది, వంట సామగ్రి పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మధ్యాహ్న మభోజనాన్ని విద్యార్థులకు వడ్డించే ముందు ఉపాధ్యాయుడు విధిగా పరిశీలించాలని సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి పి.వెంకటేశ్వర్లు, మండల ఆర్ఐ ఎస్.రామారావు, పాఠశాల ప్రిన్సిపాల్ బూర సైదయ్య గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాలుష్యాన్ని అరికట్టాలని ఆందోళన



రైస్ మిల్లు ఎదుట ఆందోళన చేస్తున్న స్థానికులు

హుజూర్‌నగర్ : పట్టణ శివారులోని మాధవరాయి నిగూడెం స్టేజీ సమీపంలో కాలుష్యం వెదజల్లుతున్న రైస్ మిల్లుపై చర్యలు తీసుకోవాలని పులువురు స్థానికులు కోరారు. ఈమేరకు బుధవారం వారు మిల్లు వద్ద ఆందోళన చేపట్టి మాట్లాడారు. శంకరసాయి రైస్ మిల్లు నుంచి విడుదలవుతున్న దుమ్ముధూళి, బూడిద తమ ఇళ్లపై పడుతుండడంతో ఇళ్లలో బట్టలు, ఆహారం బూడిదపాలవుతుందని తెలిపారు. ఈవిషయాన్ని మిల్లు యాజమాన్యం అనేకసార్లు తీసుకెళ్లినా నివారణ చర్యలు చేపట్టడం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో రఫీ, భాగ్యమ్మ, ప్రసాద్‌రావు, నాగేశ్వరరావు, అరుణ, కీర్తన లక్ష్మి, బ్రహ్మం, శ్రీనివాసరావు, ఉమ, తదితరులు పాల్గొన్నారు.

సాయుధ పోరాట యోధురాలు లక్ష్మమ్మకు నివాళి



కోట లక్ష్మమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

మోతె : మండలంలోని రావిపహాడ్ గ్రామంలో బుధవారం తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు కోట లక్ష్మమ్మ దశదిన కర్మ కార్యక్రమాన్ని సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి ముల్కూర్ గోపాల్ రెడ్డి.. పార్టీ కార్యకర్తలతో కలిసి కోట లక్ష్మమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోట లక్ష్మమ్మ కమ్యూనిస్టు పార్టీ నాయకులతో కలిసి సాయుధ పోరాటంలో ఎంతో ధైర్యంగా పోరాడారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు కాంపాటి శ్రీనివాస్, రైతు సంఘం జిల్లా నాయకురాలు కొప్పుల రజిత, మహిళా సంఘం మండల నాయకురాలు వనమ్మ, డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడు ఎలుగు మధు, గ్రామ కార్యదర్శి మల్సూర్, ఆదయ్య, తదితరులు పాల్గొన్నారు.

బలహీన వర్గాల అభివృద్ధే లక్ష్యం



రవికుమార్‌కు నియామకపత్రం అందజేస్తున్న రామచంద్రరావు

హుజూర్‌నగర్ : బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు శెట్టి రామచంద్రరావు అన్నారు. బుధవారం హుజూర్‌నగర్‌లో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ పట్టణ అధ్యక్షుడిగా పుప్పాల రవికుమార్‌ను నియమిస్తూ నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి ప్రదాత మంత్రి ఉత్తమ్ సహకారంతో నియోజకవర్గం అన్ని రంగాల్లో ముందుకు వెళ్తుందని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ఇరిగెల పొలిరెడ్డి, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ధూళిపాల శ్రీనివాస్, కాపు యూత్ నాయకులు కె.శేఖర్, ఎ.సందీప్, ఎన్.కరుణాకర్, ఎం.సాయి కిరణ్‌రెడ్డి, కె.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా నాగరాజుగౌడ్



మోతె : యువజన కాంగ్రెస్ సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శిగా మోతె మండలంలోని సిరికొండ గ్రామానికి చెందిన గునగంటి నాగరాజుగౌడ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషిచేస్తానని తెలిపారు.

నియోజకవర్గ అధ్యక్షుడిగా కుక్కడపు మహేష్

హుజూర్‌నగర్ : యువజన కాంగ్రెస్ హుజూర్‌నగర్ నియోజకవర్గ అధ్యక్షుడిగా కుక్కడపు మహేష్ ఎన్నికయ్యారు. అధ్యక్షుడి పదవికి నిర్వహించిన ఎన్నికల్లో మహేష్ అత్యధిక ఓట్లు సాధించి గెలుపొందినట్లు బుధవారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు కాంగ్రెస్ నాయకులు అభినందించారు.

మండల అధ్యక్షుడిగా సాయి



మునగాల : యూత్ కాంగ్రెస్ పార్టీ మునగాల మండల అధ్యక్షుడిగా మండలంలోని వెంకట్రాంపురం గ్రామానికి చెందిన తక్కెళ్లపాటి సాయి ఎన్నికయ్యారు. ఈ పదవికి మండలానికి చెందిన ముగ్గురు పోటీ చేయగా యూత్ కాంగ్రెస్ పార్టీ సభ్యుల ఆన్‌లైన్ ఓటింగ్‌లో సాయి 66 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఈ సందర్భంగా బుధవారం మునగాలలో సాయి విలేకరులతో మాట్లాడారు. మండలంలో కాంగ్రెస్ పార్టీ పురోభివృద్ధికి కృషిచేస్తానని తెలిపారు.

ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచాలి

భానుపురి (సూర్యాపేట) : తెలంగాణలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం పెట్టి 3వేల బస్సులను రద్దుచేసి అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారని, రద్దయిన బస్సులను వెంటనే పునరుద్ధరించి కొత్త బస్సులను ఏర్పాటు చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ కోరారు. బుధవారం పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్టీసీ బస్సు డిపో ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. మహిళలకు ఉచితం బస్సు పథకాన్ని హర్షిస్తున్నామని, అదేవిధంగా 3వేల బస్సులు రద్దు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కారింగుల వెంకన్న, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్‌కుమార్, పార్టీ జిల్లా నాయకుడు గొడ్డలి నర్సయ్య, డివిజన్ నాయకులు సయ్యద్, వీరబాబు, మారసాని చంద్రకళ, సూరం రేణుక, సంతోషిమాతా, మోహన్, నారాయణ, రమేష్, ప్రసాద్, జలంధర్, ఎల్లమ్మ, పద్మ, విజయ్, రాము, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

గోశాలకు పశుగ్రాసం అందజేత



గోశాలకు పశుగ్రాసం తీసుకెళ్తున్న నర్సింహారావు

నడిగూడెం : మండలంలోని రామాపురం గ్రామానికి చెందిన ఆదర్శ రైతు మారిశెట్టి నర్సింహారావు బుధవారం ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం వేదాద్రిలో ఉన్న గోశాలకు రూ.10 వేల విలువైన గడ్డి మోపులను అందజేశారు. ఈ సందర్భంగా నర్సింహారావును రామాపురం గ్రామ పెద్దలతో పాటు, వేదాద్రి గోశాల నిర్వాహకులు అభినందించారు.

బెల్ట్ దుకాణాలను అరికట్టాలి

భానుపురి (సూర్యాపేట) : పల్లెల్లో ఎక్కడ చూసినా బెల్ట్‌దుకాణాలే దర్శనమిస్తున్నాయని, ప్రభుత్వం వాటిని వెంటనే అరికట్టాలని ప్రగతిశీల యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధరావత్ రవి, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సక్క డిమాండ్ చేశారు. బెల్ట్ దుకాణాలను రద్దుచేసి మత్తు పదార్థాలను అరికట్టాలని కోరుతూ బుధవారం పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయం ఎదుట ఆయా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడారు. అనుమతులు లేకుండా బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తుండడంతో యువత మద్యానికి బానిసలై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. ఆలయాలు, విద్యాసంస్థలకు సమీపంలో ఉన్న వైన్‌షాపులను సైతం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు రామలింగమ్మ, కావ్య, సైదమ్మ, మంగమ్మ, జయసుధ, ఉపేంద్ర, లింగయ్య, ప్రవీణ్, అశోక్ రెడ్డి, భరత్ పాల్గొన్నారు.

షాట్‌పుట్‌లో సతీష్‌కుమార్‌కు ప్రథమ బహుమతి

సూర్యాపేటటౌన్ : జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇటీవల షాట్‌పుట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు (జీజేసీ) చెందిన పదోతరగతి విద్యార్థి సతీష్‌కుమార్‌కు జిల్లా ప్రథమ బహుమతి సాధించినట్లు పాఠశాల హెచ్ఎం జక్కి అంద్రయ్య తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థిని సన్మానించారు. ఉపాధ్యాయులు గుంటి సత్యనారాయణ, కృష్ణారెడ్డి, సుంకరి, లింగమూర్తి, పద్మ, పద్మావతి, సువర్ణ పాల్గొన్నారు.